# ★ పెండ్లి ★

ఈశ్వర్

"అదేమిట్రా, అట్లా వినిపించుకోకుండా పోతున్నావు...... మరి ఆమాటకేమంటావురా?" అన్నది షికారుపోబోతున్న నన్ను చూచి.

"ఏమిటమ్మా?" అన్నా.

"అబ్బ ఎంతనంగనాచివిరా నువ్వు. పెండ్లి అంటే ఇట్లాటలాయించేవాళ్ళని ఎక్కడాచూడలేదు, నాయనా నామాటవిను. సూర్యనారాయణ రావుగారి అమ్మాయి చక్కగా బంగారపుబొమ్మలాగ ఉంటుంది. ప్రొద్దున ఆయనవచ్చి అడిగాడు కూడారా" అన్నది అమ్మ తనమామూలుధోరణి ఏకరువపెడుతూ.

"ఇప్పుడు నాపెళ్లికేంతొందరవచ్చిందమ్మా! బి. కాం. ప్యాసయేదాకా పెండ్లి చేసుకోతలుచుకోలేదు" అన్నా. "అయ్యో అదేమిట్రా నాతండ్రీ. మనచదువు పూర్తిఅయినతర్వాత పిల్లలు రమ్మంటే వస్తారా చెప్పు. బ్రహ్మచారిముదిరినా, బెండకాయముదిరినా పనికిరాదంటారు. అయినా నీకేమైనా చిన్నవాడివా? చితకవాడివా? యిరవై ఏండ్లు పైబడ్డాయి. నేనేమో పెద్దదాన్నయిపోతిని ఇకనిన్ను ఒకయింటివాణ్ణిగాజేసి నీకడుపునపుట్టే ఆనలుసుకోసం బ్రతికి ఉన్నాను" అని కంటనీళ్లు పెట్టుకుంది అమ్మ.

"అమ్మా ఎందుకట్లా కన్నీళ్ళు పెట్టుకుంటావు? నీమాట ఏమైనా కాదన్నానా. సరే నీయిష్టప్రకారమే చెయ్యి" అన్నా. అమ్మ సంతోషంతో లోపలికి వెళ్ళింది.

సూర్యనారాయణరావుగారు మావూరిలో ఒక సంపన్నగృహస్థుడు. దాదాపు ఏభైవేలరూపాయల ఆస్తిఉన్నది. ఆయనకు ముగ్గురు కూతుళ్ళు. పెద్దకూతుళ్లిద్దరికి పెండ్లిళ్లుచేసి అత్తవారింటికి పంపించాడు. చిన్నకూతురైన అరుణను చాలగారాబముతో పెంచటంవల్ల పెద్దచదువుచదివి రూపురేఖలలో అమ్మాయికి తీసిపోకుండా ఉన్నకుర్రవాడికి యిచ్చి పెండ్లిచేయాలని, నిశ్చయించుకొన్నాడు. మాయింటికివారింటికి దూరంఎక్కువలేకపోవడంవల్ల ఆయన తరచుగా మాయింటికి వస్తూపోతూ ఉండటం, మాఅమ్మగూడ తరచుగా వారింటికి పోతూండటవల్ల స్నేహం యేర్పడ్డది.

ఒకరోజున మాటలసందర్భంలో "పిన్నిగారూ మీఅబ్బాయికి పెండ్లిచేస్తారా?" అని అడిగాడు సూర్యనారాయణరావుగారు. "అం చెయ్యాలనుకుంటున్నాము సంబంధాలుగూడ వస్తూఉన్నవి." అని అందట మాఅమ్మ. అప్పటినుంచీ సూర్యనారాయణరావుగారు మాయింటికి ఎక్కువగా రావడము, నేను యెప్పుడన్నా వారింటిమీదుగా వెళితే వాళ్లింట్లో వాళ్ళందరూ నన్నుతరచుగా చూడడంజరిగాయి. ఏమీతెలియనట్లు నాదారిన నేనుతలవంచుకొని పోయేవాణ్ణి.

ఒకరోజున నేను, అమ్మ పెండ్లికూతురుచూపులకు వెళ్ళాము. సూర్యనారాయణరావుగారు ముందుగానే తయారై ఉండడంచేత మేముపోగానే కాఫీ, ఫలహారాలు యిచ్చారు. కొంతసేపటికి అమ్మాయిని ముస్తాబుచేసి నాకెదురుగా కూచోబెట్టి "అమ్మాయి యిదివరకే అబ్బాయిగారిని చూచింది. యిక అబ్బాయి......" అంటూ లోపలికి పోయింది నాకుకాబోయే అత్తగారు. నేను మెల్లిగా తలయెత్తి అమ్మాయివైపు చూచి వెంబడే తలప్రక్కకు త్రిప్పాను. ఒక్కసారిగా కళ్ళు జిగేల్ మన్నవి. నాకుకలిగిన ఆనందాన్ని చూచి నేనే మురిసిపొయ్యాను. నామనస్సులో ఉన్న సంగతిని గ్రహించి "సరే మంచిరోజు చూచి ముహూర్తం పెట్టించండి" అంటూ లేచింది అమ్మ.

రోజులు దొర్లుకుపోయినాయి. పెండ్లిముహూర్తంరోజు వచ్చింది. ఇల్లంతా కిలకిలమంటూ చుట్టాలతో నిండిపోయింది, ఇంటిచుట్టు పందిళ్ళు వెలశాయి. పందిళ్ళనిండా దీపాలు వెలిగాయి. తోరణాలు కట్టబడ్డాయి. ఆరోజున పెండ్లి కొడుకు ముస్తాబై, బుగ్గనచుక్క, కాళ్ళకి పారాయణతో పెళ్ళివారు పంపిన కారులో కూచోని సపరివారంగా పెళ్ళివారింటికి బయల్దేరాను.

పెండ్లివారి పందిలి తోరణాలతో నిండిపోయింది. ఎక్కడచూచినా పెండ్లికివచ్చిన ఆడవారి హడావుడి ఎక్కువయింది. బాజాబజంత్రీల చప్పుడు మారుమోగుతున్నాయి. పెండ్లికివచ్చిన వారి అందరి దృష్టులు పందిరిలో మధ్యకూర్చున్న నామీద, నాకెదురుగా కూర్చున్న "......" మీద కేంద్రీకరించాయి. "మా సీతమ్మ పెండ్లి కూతురాయనే" అనే సన్నాయివాడి పాటతో పెండ్లిముగిసింది.

అదే సమయంలో పెండ్లివారి ఆడవారిలో కలవరం ప్రారంభమయింది. ఎవరో ఒకాయన మా మామగారిని అంటే సూర్యనారాయణరావు గారిని కొట్టటానికి బయటకూర్చున్నాడట. ఎందుకంటే తనకిస్తానన్నపిల్లను నాకిచ్చిచేశారని వాడి కోపం. నేను ఆపసుప్రగుడ్డలతోనే బయటకు వెళ్ళాను సంగతేమిటో కనుక్కుందామని. దాదాపు నా వయస్సులో ఉన్న యువకుడు నిప్పులు గ్రక్కుతూ బయట కూర్చున్నాడు.

"ఏమయ్యా! నీకేమైనా బుద్ధివున్నదా? నాకు యిస్తానన్న అమ్మాయిని నువ్వు లాక్కుపోతున్నావా? యిదేనా న్యాయం అంటూ నామీదకు దూకాడు.

"ఏది మాటలు సరిగారానియ్యి. నా పెండ్లి విషయంలో అడ్డంరావడానికి నీవెవరు?" అని గర్జించి ఒక దెబ్బవేశాను. చేతికేదో వెచ్చగా తగలడం, టపీమని చిమ్నీగ్లాసు క్రిందపడి పగలడం ఒక్కసారిగా జరిగాయి. "ఏంరా భాయి రేపు కెమిస్ట్రీ పరీక్ష పెట్టుకొని నిద్ర పోతున్నావు. పైగా ఏదో పెండ్లివిషయంకూడ కలవరిస్తున్నావు" అని మా రూంమేటు అచారి నా నిద్ర పూర్తిగా వదలగొట్టాడు.



అన్నార్తసహాయనిధి నిమిత్తం లండన్‌లో గానసభ, సభ రెడ్ లైన్ స్క్వేర్‌లోని కాన్వేహాల్లో జరిగింది.
చిత్రంలో ఉన్నవారు: (ఎడమనుంచి) మిస్టర్.జె. మాలిక్. (ఇండియా లీగ్ గౌరవాధ్యక్షుడు) డా. ప్రబోధ్ బెనర్జీ (గాయకులలో ఒకరు) డా. హాండూ (ఇండియా సహాయ సంఘానికి గౌరవ కోశాధికారి) మిస్. పేన్(బ్రిగ్ సేనాపతి) మిస్టర్. వి. కె. కృష్ణమీనన్ (ఇండియా హై కమీషనర్)